# అందుబాటులో ఆధార్ సేవలు

- ఈనెల 27 వరకు గ్రామాల్లో శిబిరాలు
- సర్వర్ సమస్యతో ఇక్కట్లు
- గడువు పెంచాలంటున్న ప్రజలు



జల్లికొమ్మర యూపీ స్కూల్లో ఆధార్ నవీకరణ చేయించుకుంటున్న చిన్నారి

నిడమర్రు: సంక్షేమ పథకాల లబ్ధి పొందాలన్నా.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేరాలన్నా.. ఉద్యోగం చేయాలన్నా.. ఆఖరుకు సెల్ ఫోన్‌కు సిమ్ తీసుకోవాలన్నా ఆధార్ తప్పనిసరైంది. తరచూ ఆధార్‌కు నవీకరణ, మార్పులకు సంబంధించి జనం మీ సేవ కేంద్రాలు, ఆధార్ కేంద్రాలు ఉన్న సచివాలయాల చుట్టూ తిరుగుతుంటారు. ఇవి అందరికీ అందుబాటులో లేకపోవడంతో దూరంగా ఉన్న వారికి సేవలు పొందడం భారంగా మారడంతో పిల్లలకు కొత్త ఆధార్ తీసుకోవడంలో, ఆధార్ అప్డేట్, మార్పుల విషయంలో అశ్రద్ధ చూపుతాం. ఈ నేపథ్యంలో దీంతో ఉమ్మడి పశ్చిగోదావరి జిల్లా కలెక్టర్‌ల ఆదేశాల మేరకు మొబైల్ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గ్రామసచివాలయాల్లో ఈశిబిరాలు ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.

**సర్వర్ సమస్యతో నమోదు ఆలస్యం**

ప్రచారం లేకపోవడం, వెళ్లినా సర్వర్ సమస్యతో ఈ ఆధార్ నమోదు, మార్పుల ప్రక్రియ ఆలస్య మవుతుండటంతో ఒక్కో శిబిరం వద్ద 20లోపు మాత్రమే నమోదు అవుతున్నాయి. దీంతో ఈ మొబైల్ ఆధార్ శిబిరాల ఏర్పాటు గడువు పెంచాలని, తిరిగి ఆయా గ్రామాల్లో మరోసారి నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ శిబిరాలు ఈనెల 23 నుంచి గణపవరం, నిడమర్రు, ఉంగుటూరు మండలాల్లో షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నట్లు ఆయా ఎంపీడీఓలు వెల్లడించారు భీమడోలు మండలంలో సర్వర్ సమస్యతోపాటు ఆధార్ కిట్ సమస్యతో శిబిరాలు నిర్వహించలేదని ఎంపీడీఓ స్వర్ణలత తెలిపారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు త్వరలో షెడ్యూల్ ప్రకటిస్తామని చెప్పారు.

**ఆధార్ సంఖ్యే ప్రామాణికం**

ప్రస్తుతం అన్ని సందర్భాల్లో ఆధార్ ప్రామాణికంగా మారింది. బ్యాంకు ఖాతాలు తెరవడానికి, విద్య, వైద్య, చిరునామా, వయస్సు ఇలా అన్నింటికీ దీన్నే పరిగణలోకి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆధార్ తీయించుకున్న చిన్న పిల్లలకు ఐదేళ్ల తర్వాత ఇతరులకు 10 ఏళ్ల తర్వాత కేంద్రం ప్రభుత్వం ఆధార్ నవీకరణ (అప్‌డేట్) తప్పనిసరి చేసింది. ఇందులో భాగంగా వేలిముద్రలు, కంటిపాప (ఐరిస్) నమోదు చేస్తారు. ఇక వీటితోపాటు ఇతర సేవలు ఈ మొబైల్ శిబిరాల్లో అందుబాటులో ఉంచారు. ఆధార్ అప్‌డేట్‌కు రూ.100, మిగిలిన సేవలకు రూ.50 సర్వీస్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. మార్పులు చేసిన, కొత్త కార్డుల్లో నమోదు చేసిన చిరునామాకు పోస్ట్‌లో పంపిస్తారని అధికారులు తెలిపారు.

**నేడు, రేపు ఆధార్ శిబిరాలు**

- 26న నిడమర్రు మండలం పెదనింద్రకొలను-1, దేవరగోపవరం, ఉంగుటూరు మండలం కైకరం-1, గణపవరం మండలం అగ్రహార గోపవరం, అప్పనపేట.

### ఈ మొబైల్ శిబిరాలు



ఆధార్ నమోదుపై సచివాలయాల్లో శిక్షణ పొందిన డిజిటల్ సహాయకుల ద్వారా ఈ మొబైల్ శిబిరాలను నిర్వహిస్తున్నాం. ఈ ఆపరేటర్లు ఒకొక్కరికీ ఇద్దరు సచివాలయం సిబ్బందిని సహాయకులుగా కేటాయించాం. విద్యార్థులు ఎక్కువ అవసరంగా గుర్తించి ఆయా గ్రామాల అగన్‌వాడీ కేంద్రాలకు, కళాశాలలకు, పాఠశాలలకు సమాచారం అందించి అవసరమైతే అక్కడే ఈ శిబిరాలు ఏర్పాటు చేయాలని సెక్రటరీలను ఆదేశించాం.

– జి.శివరామకృష్ణయ్య, ఎంపీడీఓ, నిడమర్రు

- 27న నిడమర్రు మండలం తోకలపల్లి, పత్తేపురం, ఉంగుటూరు మండలం గొల్లగుడెం సచివాలయం, గణపవరం మండలం ఎస్ కొండేపాడు, కేశవరం గ్రామాల్లో మొబైల్ ఆధార్ శిబిరాలు నిర్వహిస్తారు.

**ఆధార్ సేవలు ఇలా..**

- కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్ కార్డు డౌన్లోడ్ చేయడం.
- ఆధార్ నంబర్‌కు మొబైల్ నెంబర్, ఆధార్ నంబర్‌కు ఈమెయిల్ ఐడీ లింక్ చేయడం.
- బయోమెట్రిక్ (ఫొటో, ఐరీష్, ఫింగర్ ప్రింట్) అప్‌డేట్ పేరు, జన్మదిన తేదీ, చిరునామా, జెండర్ మార్పులు, తల్లిదండ్రుల పేరుల్లో తప్పులు సరి చేయుటం (సంబంధిత ప్రూఫ్స్ తప్పని సరి)
- ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ (పీఓఐ లేదా పీఓఏ ఒరిజినల్ తప్పనిసరి)

## క్లుప్తంగా

### బస్‌పాస్‌ల పంపిణీ



బస్‌పాస్‌లతో విద్యార్థులు

గణపవరం: మండలంలోని పిప్పర ఉన్నత పాఠశాలలో 220 మంది విద్యార్థులకు తాడేపల్లిగూడెం డిపోలో పనిచేస్తున్న కొవ్వూరి చినరామిరెడ్డి ఆర్థిక సాయంతో బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత చినరామిరెడ్డిని ఉపాధ్యాయులు సన్మానించారు. మానవత సేవా సంస్థ డైరెక్టర్ పాతపాటి హరికుమార్‌రాజు, ఆర్టీసీ గూడెం డిపో మేనేజరు కేఎస్ఎన్ మూర్తి మాట్లాడారు. హెచ్ఎం జయవెంకటేశ్వర్లు, ఆర్టీసీ పీఆర్వో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా పారిశుధ్య పనులు



జల్లికాకినాడలో రోడ్డుపై బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

గణపవరం: ఇటీవల భారీ వర్షాలకు గణపవరం, పిప్పర, జల్లికాకినాడ, కేశవరం, కొందేపాడు, వాకపల్లి తదితర గ్రామాల్లో వరదనీరు ప్రవేశించిన కాలనీల్లో పారిశుద్యం పనులు ముమ్మరంగా చేపట్టారు. డ్రైయిన్లలో చెత్త, పూడిక తొలగింపు, రసాయనాల పిచికారీ, రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లడం వంటి పనులు చేయిస్తున్నారు. కొందేపాడులో యనమదుర్రు కాల్వ ఉధృతి తగ్గుముఖం పట్టడంతో వరదనీరు వెనక్కి లాగడంతో శానిటేషన్ పనులు చేపట్టారు.

### పీఠాధిపతి జయరావుకు ఘన సన్మానం



ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి జయరావును సత్కరిస్తున్న దృశ్యం

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి, విశాఖపట్టణం అగ్రపీఠాధిపతి పొలిమేర జయరావు ఏలూరు పీఠాధిపతిగా అభిషేకం పొంది 11వ సంవత్సరం కావడం సంతోషంగా ఉందని అగ్రపీఠాధిపతి కార్డినల్ పూల ఆంథోని, నల్గొండ పీఠాధిపతి కరణం థామస్ కుమార్ అన్నారు. గురువారం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ కళాశాలలో కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి.మోజెస్ ఆధ్వర్యంలో జయరావును ఘన సన్మానించారు. ఏలూరు పీఠంలో ఆయన సేవలను, ప్రణాళికను ఫాదర్ మోజెస్ కొనియాడారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జాకబ్, ఫాదర్లు ఫెలిక్స్, బాబు జార్జి, ప్రిన్సిపాల్ స్లీవరాజు, వైస్ ప్రిన్సిపాల్ అనురాధ, డాక్టర్ అరుణ్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు గజమాలతో సత్కరించారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ



బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తున్న మానవత ప్రతినిధులు

భీమడోలు: భారీ వర్షాలకు భీమడోలు గ్రామంలోని పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. బాధిత కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. బీసీ కాలనీకి చెందిన మీసాల పరుశురాముడు, బి.ఆదిలక్ష్మి, చోడిశెట్టి బేబి, కోడిని నరసమ్మ, జలసూత్రం కనకమ్మ, లంక నరసమ్మ, షేక్ మున్నీ, పోలసానిపల్లికి చెందిన కూనా కొండమ్మ కుటుంబాలకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు మాట్లాడుతూ పేదలను ఆదుకోవడానికి మానవత ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఎడిటోరియల్ చైర్మన్ రామిశెట్టి గంగాధరరావు, జిల్లా కోశాధికారి పసుపులేటి సాంబశివరావు, మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, పెద్దలు తాటిమళ్ల రామ్మూర్తి, అభివృద్ధి కమిటీ సభ్యులు పోలిశెట్టి సత్యనారాయణ, ఉన్నమట్ల సత్యనారాయణ, చిలపర్తి ఆదినారాయణ పాల్గొన్నారు.

### కార్గిల్ అమరవీరులకు నివాళి

దెందులూరు: చరిత్ర ఉన్నంతకాలం కార్గిల్ యుద్ధంలో ప్రాణం పోగొట్టుకున్న భారత యుద్ధ వీరులు త్యాగం, ధైర్యం, పోరాటపటిమ నిలిచి ఉంటుందని రైల్వే బోర్డు మెంబర్ గుమ్మడి చైతన్య అన్నారు. గురువారం సానిగూడెం, గాలాయగూడెంలో బీజేపీ దెందులూరు మండల అధ్యక్షుడు బుజ్జి గోపాల్ ఆధ్వర్యంలో ఫ్లకార్డులను ప్రదర్శించారు. బుజ్జిగోపాల్ కార్గిల్ యుద్ధ వీరుల త్యాగనిరతిని వివరించారు.

### తొలగని వర్షపు నీరు



చల్లచింతలపూడిలో ఆయిల్‌ఫామ్ తోటలో నిలిచిన వరద నీరు

దెందులూరు: భారీ వర్షాలకు తోటలు, పొలాల్లో చేరిన నీరు బయటకు పోయే మార్గం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపునీరు దిగువ ప్రాంతానికి వెళ్లే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పొలాలకు ఇబ్బంది లేకుండా రైతులు చర్యలు తీసుకున్నారు. మెట్ట ప్రాంతాలైన చల్లచింతలపూడి, ఇతర గ్రామాల్లో పామాయిల్ తోటలు, పండ్ల తోటలు, వరి పొలాలు ముంపులోనే ఉన్నాయి.

### నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

దెందులూరు: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏలూరు రూరల్ సబ్‌డివిజన్ పరిధిలో (బాలయోగి సైన్స్ పార్కు, అశోక్‌నగర్ సబ్‌స్టేషన్ వద్ద) శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటుచేస్తున్నట్టు కన్సూమర్ గ్రీవెన్స్ రెడ్రీసెల్స్ ఫారం చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ తెలిపారు. సాంకేతిక సభ్యులు జనార్ధనరావు, ఆర్థిక సభ్యులు శ్రీనివాస్, స్వతంత్ర సభ్యుడు సురేంద్ర పాల్గొంటారని ఆయన వివరించారు.

# అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



భీమడోలు : పలు రకాల పండ్లు తయారు చేసిన పోలసానిపల్లి నెం.3 చిన్నారులు



భీమడోలు : పాతూరులో దేశనాయకుల జీవిత చరిత్ర చెబుతున్న చిన్నారి

భీమడోలు: నూతన విద్యా విధానం 2020 ప్రారంభించి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో చేపట్టిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం పాఠశాలల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భీమడోలు, గుండుగొలను, పోలసానిపల్లి, సూరప్పగూడెం, పాతూరు, వడ్లపట్ల తదితర పాఠశాలల్లో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. వారు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నారు. చిన్నారులు దేశభక్తి గేయాలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను వివరిస్తూ ఆలోచింపజేశారు. ఫ్యాన్సీ డ్రెస్‌లు, నృత్యాలు, ప్రముఖ దేశభక్తుల నాయకులు మోనో యాక్షన్, వారి ఇచ్చిన నినాదాలు, రాష్ట్రంలోని సంగీత సాహిత్య కళాశాల ఫొటోలను ప్రదర్శించారు. దీంతో పాఠశాలల్లో పండుగ వాతావరణం ఏర్పడింది.

సాంస్కృతిక వేడుకలు

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు అధ్యక్షత సాంస్కృతిక దినోత్సవం వహించారు.



ఉంగుటూరు : జెడ్పీ హైస్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు

పిల్లలచే ఫాన్సీ డ్రెస్, నృత్యాలు ప్రముఖ దేశభక్తుల నాయకుల మోనో యాక్షన్, భిన్నత్వంలో ఏకత్వం పై నాటిక ప్రదర్శనలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సలగాల గోపి మాట్లాడుతూ విద్యార్థులందరూ భావిభారత పౌరులుగా భారతీయ సంస్కృతిని అలవర్చుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ యాళ్ల సుజీవరావు, ప్రధానోపాధ్యాయులు మాట్లాడారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జి.గవరయ్య పిల్లలకు రాజ్యాంగ పీఠిక చదివి, దాని అర్థాన్ని వివరించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు కె.రాజకుమారి, ఎం.రవి, కన్నారావు విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ రుణాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా

పెదవేగి: అర్హులైన కౌలురైతులందరికీ ఖరీఫ్ సీజన్ దృష్ట్యా బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ హబీబ్‌బాషా అన్నారు. గురువారం పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా కౌలు రైతు కార్డు ఉన్న రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు వెళ్ళి మేనేజర్‌ను కలిసి బ్యాంకు పరిధిలో ఉన్న కొప్పాక, బి.శింగవరం, పెదకడిమి, పినకడిమి, అంకన్నగూడెం, అమ్మపాలెం, భోగాపురం గ్రామాల్లో కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు అందించాలని కోరారు. అనంతరం రైతులను ఖరీఫ్ సీజన్‌లో వేసిన పంటల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తమ పరపతిని కౌలు రైతులు పెంచుకోవాలని సూచించారు. జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు, మండల వ్యవసాయ శాఖాధికారి ఎం ప్రియాంక, రైతులు ఉన్నారు.

### నేడు సామాజిక తనిఖీపై ప్రజా వేదిక

పెదపాడు: సామాజిక తనిఖీపై ప్రజా వేదిక స్థానిక మండలపరిషత్ కార్యాలయంవద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జె.తేజరతన్ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమంలో భాగంగా ఈ వేదిక ఏర్పాటుచేస్తున్నట్టు పేర్కొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గణపవరం: గణపవరం మండలం సరిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గణపవరం, సరిపల్లె, చినరామచంద్రపురం, క్రొవ్విడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ తెలిపారు.

# చిన వెంకన్న హుండీ ఆదాయం రూ.2.41 కోట్లు



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ద్వారకా తిరుమల చిన వెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. 28 రోజులకు నగదు రూపేణా శ్రీవారికి రూ. 2,41,72,018, కానుకల రూపేణా 401 గ్రాముల బంగారం, 6.222 కేజీల వెండి, విదేశీ కరెన్సీ అధికంగా లభించినట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. అలాగే లెక్కింపులోకి రాని రద్దైన పాత రూ.2000, రూ.1,000, రూ.500 నోట్ల ద్వారా రూ. 1,71,000 లభించినట్టు చెప్పారు. లెక్కింపులో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఏలూరులో స్టాప్ డయేరియా



28వ డివిజన్‌లో దోమల నిర్మూలనకు ఆయిల్ బాల్స్ నీటి నిల్వల్లో వేస్తున్న డాక్టర్ మాలతి

ఏలూరు టౌన్: దోమల నిర్మూలనకు, డయేరియా నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఏలూరు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి అన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాల మేరకు స్టాప్ డయేరియా ప్రోగ్రామ్ చేపట్టామన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏలూరు 28వ డివిజన్‌లోని ద్వారకానగర్, బీడీ కాలనీ, వాణినగర్ తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు మురుగు కాలువలు, నీటి నిల్వల్లో ఆయిల్ బాల్స్ వేయటంతోపాటు, ఫాగింగ్ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తంగిరాల సురేష్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, సూపర్‌వైజర్ డి.దుర్గారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

### ఆధార్ నమోదు శిబిరాలు ప్రారంభం



ఆధార్ నమోదు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శర్మ

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఆధార్ నమోదు శిబిరాలను ప్రారంభించామని ఎంపీడీఓ శర్మ తెలిపారు. గురువారం నారాయణపురం సెంటర్లో ఆధార్ సెంటరును సర్పంచ్ దిడ్ల అలకానంద, ఎంపీటీసీ సభ్యులు బండారు నాగరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పోతునూరులో..

దెందులూరు: పోతునూరు ఉన్నత పాఠశాలలో ఆధార్ నమోదు శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. మండలంలో అన్ని ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వి.శ్రీలత ప్రజలకు సూచించారు.

# వరద బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): భారీ వర్షాలు, వరద బాధితుల సహాయార్థం సీపీఎం విరాళాల సేకరణ చేపట్టింది. వారం రోజులుగా స్థానిక పవరుపేట, ఆర్ఆర్‌పేట ప్రాంతాల మార్కెట్‌లో ఇప్పటి వరకు రూ.6,750 సేకరించింది. ఈ మొత్తాన్ని పార్టీ జిల్లా కమిటీ ద్వారా నిర్వాసిత గ్రామాలకు నిత్యావసర సరుకుల పంపిణీ నిమిత్తం అందజేస్తామని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 25 గ్రామాలుకు పైగా వరద తాకిడికి గురయ్యాయని చెప్పారు. ప్రస్తుతం అక్కడి ప్రజానీకం కొండలు, గుట్టలు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిబిరాల్లో తలదాచుకుంటున్నారని వివరించారు. ఇప్పటికైనా పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందజేయాలని కిషోర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.జగన్నాథరావు, వి.సాయిబాబు, ఎం ఇస్సాక్, జె.గోపి, జి.శారద, ఎం.సత్యనారాయణ, పి.దుర్గాప్రసాద్, కె.లెనిన్, అల్లం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కౌలు రైతులకు రుణాలు



కౌలు రైతులకు రుణాలు అందిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా

పెదపాడు : అర్హులైన కౌలు రైతులందరికీ వ్యవసాయ రుణాలు అందించాలని జిల్లావ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. పెదపాడు మండలం వట్లూరు గ్రామంలో ఎస్‌బీఐ వట్లూరు బ్రాంచి పరిధిలోని వట్లూరు, కలపర్రు, కొక్కిరపాడు, వేంపాడు గ్రామాల్లోని కౌలురైతులకు రుణాలు అందించారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన ప్రతి రైతుకూ రుణాలు అందించేలా చర్యలు చేపట్టాలని హబీబ్ బాషా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ వై.సుబ్బారావు, వ్యసాయ అధికారి వి.ప్రదీప్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

# మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ మేరి

ద్వారకాతిరుమల: గృహ హింస చట్టం, దాని వలన కలిగే రక్షణ గురించి మహిళలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి అన్నారు. మండలంలోని గుండుగొలనుకుంట అంగన్‌వాడీ కేంద్రంలో మహిళా సాధికారిత, బేటి బచావో-బేటి పఢావో 100 డేస్ ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి గృహ హింస చట్టం, దాని ద్వారా కల్పించే రక్షణ, న్యాయస్థానం విచారణ విధానం, అప్పీల్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జీఎంఎస్‌కే సుజనా మాట్లాడుతూ ఏ దేశంలో అయితే స్త్రీ ఆర్థిక, రాజకీయ సామాజిక స్వావలంబన కలిగి ఉంటుందో ఆ దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. 2015 లో ప్రారంభించబడిన బేటి బచావో.. బేటి పఢావో పథకం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో, వారి పూర్తి పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారన్నారు. లింగ పక్షపాతం తగ్గించడం, ఆడ పిల్లలకు మనుగడ, రక్షణ కల్పించడం, బాలికలకు చదువు అందేటట్లు చూడడం ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

# బాలుర వసతి గృహంలో సేవలపై ఆరా



వసతి గృహంలో ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ స్థానిక శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని గురువారం సందర్శించారు. వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత, పిల్లల భద్రత, వైద్య సదుపాయాల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి తగు సూచనలు చేశారు. బాలురు తమకు విద్యాబోధన చేసేందుకు సరైన ఉపాధ్యాయులు సౌకర్యం లేదని ఫిర్యాదు చేయగా, తక్షణం సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ పి.శ్రీవల్లి వసతి గృహ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం



అధ్యక్షునిగా ఎన్నికైన సీతారామారావుకు నియామక పత్రం అందిస్తున్న నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జాయింట్ సెక్రెటరీ మినహా మిగిలిన అన్ని పదవులకూ ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో కార్యవర్గం ఏకగ్రీవమైనట్టు ప్రస్తుత అధ్యక్షుడు అబ్బినేని విజయ్ కుమార్ తెలిపారు. జాయింట్ సెక్రెటరీ పదవికి గెల్లా శ్రీనివాసరావు, నోముల రాముడు ఇద్దరు పోటీ పడటంతో ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ ఒక్క పదవికి వచ్చే నెల 2న ఎన్నిక నిర్వహిస్తామన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోనే సీతారామారావు, ఉపాధ్యక్షుడిగా మాండ్రు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శిగా చింతమనేని రమేష్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శిగా తిరిగిపల్లి సుబ్బారావు, కోశాధికారిగా బందెల నానాజీ, లైబ్రరీ కార్యదర్శిగా ఎంజీవీఎస్ ఫణికుమార్, మహిళా ప్రతినిధిగా పుట్టా కనకదుర్గా భవాని ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు.

**ఉపాధ్యక్షుడికి అభినందనలు**

ఏలూరు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన మాండ్రు రాజేంద్రను ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ అభినందించారు. ఇప్పటికే సీబీడీపీపీగా తనదైన శైలిలో సేవలందిస్తున్న రాజేంద్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికవడం అభినందనీయమని కొనియాడారు. అభినందనలు తెలిపిన వారిలో వెంపా నాగరాజు, భూషణం ఉన్నారు.

### రేపు చలో పొన్నూరు

ఏలూరు (టూటౌన్): గుంటూరు జిల్లా పొన్నూరులో ఈ నెల 27న నిర్వహించే దళితుల ఆత్మగౌరవ పోరాట యోధుడు కవి రచయిత డాక్టర్ కత్తిపద్మారావు పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దళిత బహుజన నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక కొత్తరోడ్డులోని నవ సమాజ సొసైటీ కార్యాలయంలో చలో పొన్నూరు కార్యక్రమ కరపత్రాన్ని గురువారం విడుదల చేశారు.

### 30న మండల పరిషత్ సమావేశం

ఏలూరు రూరల్ : ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన ఈనెల 30న ఉదయం 10.30 గంటలకు ఏర్పాటుచేయనున్నట్టు ఎంపీడీఓ బి.ప్రణవి తెలిపారు. మూడునెలలకు ఒకసారి జరిగే సమావేశంలో మండలభివృద్ధితో పాటు సమస్యలపై సభ్యులు చర్చిస్తారని పేర్కొన్నారు.